ఈ-కేవైసీతోనే సాగు భద్రం

- కౌలు రైతులకు మరింత మేలు
- ధాన్యం అమ్మకం సులభతరం



మేడపాడు రైతు భరోసా కేంద్రం వద్ద రైతుల నుంచి ఈకేవైసీ తీసుకుంటున్న వ్యవసాయ అధికారులు

యలమంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత రైతులకు ప్రయోజనం కలిగించేలా అనేక సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి సచివాలయానికి ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకే అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం 80 శాతం మంది కౌలు రైతులే వరి సాగు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చి పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి వచ్చే నష్ట పరిహారం, సబ్సిడీలు గతంలో వరి సాగు చేసిన కౌలు రైతులకు అందేది కాదు. దీనిని దృష్టిలో ఉంచుకునే ప్రస్తుత ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదు చేసి ఈ-కేవైసీ ద్వారా వాస్తవ రైతులను గుర్తించే విధానం అమలు చేస్తుంది. ఈ విధానంలో పంట ఊడ్పులు పూర్తయిన వెంటనే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు ఏ సర్వే నెంబరు భూమిలో, ఏ రైతు వరి సాగు చేశారో ఈ క్రాప్‌లో నమోదు చేసి అతని వేలిముద్ర వేస్తారు. తరువాత అది వీఆర్వో లాగిన్‌లోనికి వెళ్తుంది. అక్కడ వీఆర్వో సర్వే నెంబరు సరి చూసుకుని తప్పొప్పులు ఉంటే సరి చేసి తరువాత అతను కూడా వేలిముద్ర వేసి ధ్రువీకరిస్తారు. అనంతరం సంబంధిత రైతులు తమ ఆధార్‌కార్డు తీసుకుని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఈ విధంగా ఈకేవైసీ చేయడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు వచ్చి పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పంట నష్టపరిహారాలు, సబ్సిడీలు నిజంగా సాగు చేసిన రైతుకే అందుతాయి. పైగా ధాన్యం రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొంటుంది. ఆ సమయంలో రైతులు తమ ధాన్యం అమ్ముకోవడానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈకేవైసీ ఉపయోగపడుతుంది. వ్యవసాయంలో పారదర్శకత తీసుకురావడానికి తీసుకువచ్చిన ఈ చర్యలు కౌలు రైతులకు చాలా మేలు చేస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

25 లోపు ఈ-కేవైసీ వేయాలి



ఈ-కేవైసీ విధానం వల్ల నిజంగా వరి సాగు చేస్తున్న రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. గతంలో పంట నష్టపరిహారం సొంత రైతుల ఖాతాలో జమయ్యేది. దీంతో కౌలు రైతు నష్టపోయినా పరిహారం అందేది కాదు. ఇప్పుడు ఈ-కేవైసీ వల్ల ఎవరైతే సాగు చేస్తున్నారో వారికే ప్రభుత్వం నుంచే నష్ట పరిహారం రాయితీలు అందుతున్నాయి. ఈ-కేవైసీ చేయించుకోవడానికి ఈ నెల 25 వరకే గడువు ఉంది. రైతులంతా గడువులోపు సంబంధిత రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ఈ-కేవైసీ వేయాలి.

– చిందులూరి దేవి, ఏఓ, యలమంచిలి

నరసాపురం డివిజన్‌లో ఈ-కేవైసీ నమోదు వివరాలు

మండలం	వరి సాగైన భూమి (ఎకరాల్లో)	మొత్తం రైతులు	ఈకేవైసీ వేసిన రైతులు
యలమంచిలి	5,811	4,102	4,022
పాలకొల్లు	10,045	6,118	5,336
పోడూరు	12,071	6,203	5,122
నరసాపురం	8,816	4,621	4,252
మొగల్తూరు	1,325	887	838
ఆచంట	10,432	6,101	3,896
పెనుగొండ	11,965	5,647	4,487
పెనుమంట్ర	12,276	6,718	5,862

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో మత్స్యకారులకు ప్రాధాన్యం

నరసాపురం రూరల్: రాష్ట్రంలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే, గవర్నర్ కోటాలో వైఎస్సార్ సీపీ ఎంపిక చేసిన అభ్యర్థుల్లో ప్రాధాన్యతను ఇచ్చారని జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు బొడ్డు ఆశిష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన కులాలను ఓటు బ్యాంకుగా కాకుండా వెన్నెముకగా భావించే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ వెల్లడించారు. బీసీలకు కేటాయించిన ఎమ్మెల్సీల్లో అధిక శాతం మత్స్యకారులు ఉన్నారని పేర్కొన్నారు. మత్స్యకారుడైన మోపిదేవి వెంకటరమణను మొట్టమొదట రాజ్యసభకు పంపిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కే దక్కుతుందని వివరించారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి తిరిగి పట్టం కట్టేందుకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆశిష్ కుమార్ పేర్కొన్నారు.

28 నుంచి కొప్పర్రు దుర్గమ్మ జాతర

నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రులో ఉన్న శ్రీ దుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఉయ్యాల సేవ, గ్రామోత్సవం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర చివరి రోజైన మార్చి 3న అఖండ అన్నసమారాధనా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

పాఠశాలకు బీరువాల అందజేత

మొగల్తూరు: స్థానిక పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1965–66 బ్యాచ్ ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులు బుధవారం రెండు బీరువాలను పాఠశాల సిబ్బందికి అందించారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి ప్రముఖ నిర్మాత యూవీ సూర్యనారాయణరాజు జ్ఞాపకార్థం ఆయన స్నేహితులు ఎం.సత్యనారాయణ, డి.కనకేశ్వరరావులు బీరువాలను ప్రధానోపాధ్యాయులు ఎస్వీ మూర్తి రాజుకు అందించారు. ఈ కార్యక్రమంలో బీవీఎల్ నరసింహారావు, సంకు నరసింహారావు, బి.పరుశురాముడు, ఎన్‌వీబీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్వే రిపోర్ట్‌ను ఆన్‌లైన్ చేయాలి

మొగల్తూరు: సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై చేపట్టిన సర్వే నివేదికను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద కుమార్ సూచించారు. ఎస్‌డీజీ(సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్) సుస్థిర, అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారులు ఎనిమిది అంశాలపై సర్వే చేయించాలని సూచించారని కార్యదర్శులు, వలంటీర్లు, సంక్షేమ శాఖ సహాయకులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, సర్వేలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నవీన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేత విన్నకోటకు నివాళి

పాలకొల్లు అర్బన్: కార్మికనేత, రంగస్థల నటుడు, సీనియర్ పాత్రికేయుడు విన్నకోట వెంకటేశ్వరరావు మృతి పాలకొల్లు ప్రాంత ప్రజలకు తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. పాలకొల్లు ప్రెస్ క్లబ్ ఆవరణలో బుధవారం నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో విన్నకోట చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కత్తుల రామమోహన్‌రావు, తాళాబత్తుల వెంకటేశ్వరరావు, సినీ దర్శకుడు ఆకుమర్తి బాబూరావు, వంగా నరసింహారావు, పుత్సల నాగలింగేశ్వరరావు, షేక్ కాలేషావలీ, మామిడిశెట్టి శ్రీనివాసరావు, చెల్లబోయిన రామిశెట్టి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. .

క్లుప్తంగా

మొగల్తూరులో ఫ్యామిలీ ఫిజిషియన్



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ దినేష్

మొగల్తూరు: మొగల్తూరు–2 సచివాలయ పరిధిలో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను, అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో పాటు లేవలేని పరిస్థితుల్లో ఉన్న రోగులను ఇంటికి వెళ్లి పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలో సుమారు 175 మంది రోగులకు పరీక్షలు చేశామని డాక్టర్ దినేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది విజయలక్ష్మి, స్వరూపరాణి, చాందినీ ప్రియ, ప్రభాకర్, ఆశ వర్కర్లు రమాదేవి, నాగలక్ష్మి, బేబి, వరలక్ష్మి, శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడకు ఘన నివాళి



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎం.చారుమతి

పెనుమంట్ర: మండలంలోని మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభను బుధవారం నిర్వహించారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌చార్జ్ ఏడీఆర్ డాక్టర్ ఎం చారుమతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నరసింహారెడ్డి జీవితచరిత్రను ఆయన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ముందుగా నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నరసింహారెడ్డి జీవిత విశేషాలు గురించి తెలిపారు.

ఘనంగా మౌలానా వర్ధంతి



పాఠశాలలో మౌలానా అబుల్ కలాం అజాద్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం భారతదేశ తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ అబుల్ కలాం అజాద్‌కు 1992లో భారతరత్న బిరుదును ప్రకటించి గౌరవించిందన్నారు. మౌలానా పుట్టినరోజైన నవంబర్ 11వ తేదిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.త్రిమూర్తులు, చంద్రకళ, బొక్కా భవానీ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప దర్శకుడు కోడి రామకృష్ణ



కోడి రామకృష్ణకు నివాళులర్పిస్తున్న ఎల్.పి.ఎఫ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో పుట్టి తెలుగు చలన చిత్ర పరిశ్రమలో కష్టాన్ని నమ్ముకుని అంచెలంచెలుగా ఎదుగుతూ గొప్ప దర్శకునిగా గుర్తింపు పొందిన సినీ దర్శకులు కోడి రామకృష్ణ పాలకొల్లుకు ఖ్యాతిని తీసుకువచ్చారని ఎల్‌పీఎఫ్ చైర్మన్ ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్ అన్నారు. బుధవారం కోడి రామకృష్ణ వర్ధంతి సందర్భంగా స్థానిక వై జంక్షన్ వద్ద లవ్ పీపుల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షార్ట్ ఫిల్మ్ దర్శకుడు రావి హరీష్‌బాబు, పోకల గంగాధర్, భీమాల సతీష్, కడలి శ్రీనివాస్, కొయ్యే సహదేవుడు, కారిపల్లి పవన్‌కుమార్, కొల్లాబత్తుల సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

భీమవరం అర్బన్: జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టాలని హౌసింగ్ ఏఈ శశికుమార్ అన్నారు. మండలంలోని యనమదుర్రు గ్రామంలో ఇళ్ల స్థలాల లబ్దిదారులకు, తాపీ మేస్త్రీలకు బుధవారం ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ శశికుమార్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు వాతావరణం అనుకూలంగా ఉందని, ప్రభుత్వం లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే విధంగా ప్రోత్సహిస్తోందన్నారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



పార్వతీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు: స్థానిక పార్వతీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద మధ్యాహ్నం నుంచి భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు.

సామాజిక న్యాయంతో చంద్రబాబు డ్రామాలు బట్టబయలు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



ఆచంటలో గడపగడపకూ మన ప్రభుత్వంలో సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక పాలన, సామాజిక న్యాయం పాటించడం నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి చంద్రబాబు ఆడుతున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం ఆచంట మండలంలోని కోనపోతుగుంట, మానేవారి పాలెంల్లో గడపగడపకూ ప్రభుత్వం నిర్వహించి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని లబ్ధిదారులకు వివరించారు. మరింత సంక్షేమం అమలు కావాలంటే సీఎం జగన్‌కు అండగా ఉండాల్సిన ఆవశ్యకత వివరించారు. రాష్ట్రంలో ప్రతీ వర్గానికి సంక్షేమాన్ని అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేదోడుగా నిలిచారన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేసి పేదలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. చంద్రబాబు, ఇతర నాయకులు చేస్తున్న దుష్ప్రచారం నమ్మవద్దన్నారు. నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. ఎన్నికల జగన్ పాలనలో ఎటువంటి అవినీతి లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి నేరుగా ఖాతాల్లో జమచేస్తున్నారన్నారు. అదేవిధంగా వలంటీర్ల నియామకం, సచివాలయ పోస్టుల భర్తీలోనూ ఎక్కడా అవినీతి లేకుండా ఎంపిక చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాబోయే రోజుల్లో మరింత సంక్షేమం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, చిట్టిమోజేస్, గణేషుల సుబ్బారావు, నెక్కంటి రామలింగేశ్వరరావు, శీలం చిట్టియ్య, బండి పద్మారావు, గుబ్బల రామకృష్ణ, కామన హరిబాబు, గుత్తుల రామకృష్ణ, కడలి రాము, వేమ అప్పారావు, మానేపల్లి రవీంద్ర, అడ్డాల పెద్దిరాజు, కడలి నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వలంధర్ రేవులో వసతుల లేమి



బురదతో అధ్వానంగా ఉన్న నరసాపురం వశిష్టా వలంధర్ రేవు

నరసాపురం: నిత్యం రద్దీగా ఉండే వశిష్టాగోదావరి వలంధర్ రేవులో కనీస వసతులు లేక అక్కడికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునిసిపల్ అధికారులు ఈ విషయంలో దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. పట్టణంలో గోదావరి వలందర్ రేవు ప్రధానమైంది. కర్మకాండలు, పూజలు నిమిత్తం దూరప్రాంతాల నుంచి నిత్యం రేవుకు అనేక మంది వస్తుంటారు. ప్రతీరోజూ వందల సంఖ్యలో భక్తులు రేవులో స్నానాలు చేస్తారు. కానీ రేవులో కనీస వసతులు మాత్రం లేవు. ముఖ్యంగా రేవును శుభ్రం చేయడం లేదు. దీంతో రేవు నిండా బురద పేరుకు పోతుంది. దీంతో స్నానాలకు దిగిన భక్తులు రేవులో కాళ్లు జారి పడుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదాలకు గురి కావాల్సి వస్తోందోనని భక్తులు భయాందోళనలు చెందుతున్నారు. రేవులో అస్తికలు కలిపిన కుండలు వంటివి ఎప్పటికప్పుడు తీయకపోవడం కూడా ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. రేవులో 6 అడుగులు దూరం దాటి వెళితే చాలా లోతు ఉంటుంది. సముద్రపు పోటు స్థానికంగా రేవులో నీరు ఎక్కువగా ఉంటుంది. పోటు సమయంలో రేవులో నీరు లేక పోతే అక్కడి అధ్వాన పరిస్థితులు పైకి పూర్తిగా కన్పిస్తాయి. ముఖ్యంగా రేవులో తాగునీటికి సంబంధించి ఓ మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు.

నామినేషన్ వేయడానికి ర్యాలీగా వెళ్లిన కవురు



సాయిబాబాను దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ నుంచి ప్రకటించిన జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ బుధవారం పాలకొల్లు నుంచి ర్యాలీగా ఏలూరు తరలివెళ్లారు. ముందుగా శ్రీ షిర్డీ సాయిబాబాను దర్శించుకున్న అనంతరం ఆయన పార్టీ శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులతో ఏలూరు వెళ్లారు. ఆయన వెంట చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, జెడ్పీ ఫ్లోర్ లీడర్ గుంటూరు పెద్దిరాజు, ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, పార్టీ కన్వీనర్లు ఎం.మైఖేల్ రాజు, కలిదిండి గణపతిరాజు, అడబాల వెంకట రమణ, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, మామిడి బాబు, గాదె వెంకన్న, కావలి శ్రీనివాసరావు, నంబూరు శ్రీ గంగా పవన్ తదితరులు సుమారు 25 కార్లలో తరలి వెళ్లారు.

సొంత ఖర్చులతో తాగునీరు అందజేత



పెనుగొండ కోడి పందేల దిబ్బలో తాగునీటి సరఫరా ప్రారంభిస్తున్న ఉప సర్పంచ్ వరలక్ష్మి

పెనుగొండ: పంచాయతీ నుంచి తాగునీరు సరఫరా లేక నానా అవస్థలు పడుతున్న కోడి పందేల దిబ్బ కాలనీ వాసులకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో తాగునీటి సరఫర ప్రారంభించారు. ఇటీవల నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వంలో కోడి పందేల దిబ్బ కాలనీలో తాగునీటి ఇబ్బందులను స్థానికులు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు వివరించారు. వెంటనే స్పందించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు త్వరలోనే కోడి పందేల దిబ్బలో వాటర్ ట్యాంకు నిర్మిస్తామని తెలిపారు. దీనికి నిధులు సైతం మంజూరు చేశామని, పంచాయతీలో తీర్మానాలు చేయడంలో ఆలస్యం అవుతుందని తెలిపారు. వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తయ్యే వరకూ సొంత ఖర్చులతో తాగునీటి పంపిణీ చేస్తామని భరోసా ఇచ్చారు. దీనికి అనుగుణంగా వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. బుధవారం వాటర్ ట్యాంకుతో తాగునీటి పంపిణీని ఉప సర్పంచ్ ఆకికొట్టి వరలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుర్యాలు షేక్ రిజ్వానా పాల్గొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం త్రాగునీటి సరఫర ప్రారంభించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కోడి పందేల దిబ్బ మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశ్రీతో తెలుగు కవిత్వం కొత్త పుంతలు




కార్యక్రమంలో మాట్లాడుతున్న గురు సహస్రావధాని కడిమిళ్ల వరప్రసాద్

నరసాపురం: మహాకవి శ్రీశ్రీ తెలుగు కవిత్వాన్ని కొత్త పుంతలు తొక్కించారని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ గురు సహస్రావధాని అన్నారు. అల్లూరి సాంస్కృతిక కేంద్రం, భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన రెడ్‌బుక్ డే వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహా ప్రస్థానంలో శ్రీశ్రీ సామ్యవాదాన్ని వినిపించారని చెప్పారు. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లు ఎత్తిన కూలీలు ఎవ్వరు? అని ప్రశ్నించడానికి ఎంతో ధైర్యం కావాలని వివరించారు. భగత్‌సింగ్ విజ్ఞాన సేవా కేంద్రం ఇన్‌చార్జ్ ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ 19వ దశాబ్దంలో ప్రపంచాన్ని శ్రీశ్రీ కవిత్వం కుదిపేసిందన్నారు. పొన్నపల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 70, 80 దశకాల్లో యువతపై శ్రీశ్రీ ప్రభావం ఎక్కువగా ఉండేదన్నారు. కార్యక్రమంలో కవురు పెద్దిరాజు, శిరిగినీడి ఉమాశంకర్, రచయిత ఎమ్మెస్ తదితరులు పాల్గొన్నారు.

చిప్ ప్రాధాన్యతను ఇంజినీర్లు గుర్తించాలి

సాక్షి, భీమవరం : ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచంలో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ప్రధానమైన మైక్రో చిప్స్ ఉక్రెయిన్ నుంచే సరఫరా అవుతున్నాయని బెంగుళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ విజిటింగ్ సైంటిస్ట్ సెంటర్ ఫర్ నానో సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డాక్టర్ వైపీ ప్రభాకర్‌రావు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ప్రపంచమంతా మైక్రోచిప్స్ తయారీపై దృష్టి పెట్టిందని దీనిలో భాగంగానే ఇప్పటికే యూఎస్ ఈ రంగంలో బిలియన్ డాలర్లు ఖర్చుపెడుతుండగా మనదేశం ఉత్పత్తి రంగంలో పలు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో ప్రధానమైన చిప్ కారణంగా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ కష్టాలు ఎదుర్కొంటుందంటే చిప్ ప్రాధాన్యతను ప్రతి ఇంజనీరు గుర్తించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ఈసీఈ హెడ్ డాక్టర్ ఎస్.ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



శిబిరం వద్ద డాక్టర్లతో లయన్స్ ఫెమినా క్లబ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తించి అవసరమైన చికిత్స అందిస్తే రోగి ప్రాణాలతో నిలుస్తారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి(బాబ్జి) అన్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్ ఆవరణలో బుధవారం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు, లయన్స్ ఫెమినా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని డాక్టర్ బాబ్జి ప్రారంభించి మాట్లాడారు. మణిపాల్ హాస్పటల్, విజయవాడ మొబైల్ యూనిట్ సాయంతో బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారం సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. సుమారు 300 మంది మహిళలకు మామోగ్రఫీ, ప్యాప్స్‌మియర్, ఈసీజీ, ర్యాండమ్ బ్లడ్ సుగర్, బీపీ, జనరల్ పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్దరాజు, లయన్స్ ఫెమినా క్లబ్ అధ్యక్షురాలు సామవేదం వసంతలక్ష్మి, కార్యదర్శి ఆర్.మణిదీప్తి, కోశాధికారి ఆర్.చైతన్య, ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్ విద్యాసంస్థల అధిపతులు ఎంఎస్ వాసు, ఎం.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ జాతరకు భారీ ఏర్పాట్లు

ఉండి: ప్రసిద్ధిగాంచిన ఉండి మండలం వెలివర్రు వీరపేరంటాలమ్మ వారి జాతర మహోత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంతెన రంగరాజు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో మేనేజర్ ఆర్‌పీఆర్ కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్మకర్తల మండలి సమావేశంలో జాతర ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. ముందుగా ధర్మకర్తల మండలి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతర, ఈ సందర్భంగా చైర్మన్ రంగరాజు మాట్లాడుతూ మార్చి 22వ తేదీ ఉగాది పర్వదినం నుంచి 31వ తేదీ శ్రీరామనవమి వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులు సంఖ్యకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్లపైనే వ్యాపార సామగ్రి



బోనగిరి వారి సందులో వ్యాపారస్తులు రోడ్డుపైనే పెట్టిన సామాగ్రి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో జరిగే వ్యాపారంలో 60 శాతం వ్యాపారం చిన్న చిన్న సందుల్లోనే జరుగుతుంది. పట్టణంలో మహాత్మాగాంధీ మెయిన్‌రోడ్డు తప్ప మిగిలిన రోడ్లన్నీ చిన్న చిన్న రోడ్లే ఉంటాయి. వ్యాపారాలు ఎక్కువగా ఈ సందుల్లోనే జరుగుతుంది. కానీ వ్యాపారస్తులు తమ వ్యాపార సామగ్రిని రోడ్లపైనే లాట్లుగా పెడుతుంటారు. స్థానిక బోనగిరి వారి వీధిలో ఓ హోల్‌సేల్ ఫ్యాన్సీ షాపు యజమాని ఇలా రోడ్డుపై తమ స్టాక్‌ను పెట్టి ఉంచేశారు. ఆ పక్కనే వినియోగదారులు తమ వాహనాలను పార్క్ చేసుకుంటున్నారు. దీనివల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఒక్కోసారి ఈ సందుల్లోకి ఆటోలు, చిన్న కార్లు వస్తుండడంతో ఇంక ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్నట్లే. వాహనదారులు ఇన్ని ఇబ్బందులకు గురవుతున్నా సరే వాహనదారులే తప్పించుకుని వెళ్లాలి తప్ప వ్యాపారస్తులు మాత్రం తమ సామగ్రిని ఇంచు కూడా కదపరు. వీరిపై పోలీసులు, మునిసిపల్ అధికారులు కఠినంగానే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.